క్లుప్తంగా

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



పిడుగురాళ్ల: పట్టణంలోని భగవాన్ శ్రీ సత్య సాయి మందిరం వారి ఆధ్వర్యంలో కొత్త కోటేశ్వరరావు సహకారంతో 28వ రోజు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త సాంబశివరావు హాజరై మజ్జిగను పట్టణ ప్రజలకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మజ్జిగ పంపిణీ వల్ల ఎండ తీవ్రతను తగ్గించుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వేసవి తాపం తీర్చేందుకు మజ్జిగ ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పట్టణంలోని మస్తాన్‌వలి, రామారావు, మణికంఠ, మధు, రమేష్, మహేష్‌రెడ్డి.

ఆయుర్వేద వైద్యశాలకు స్థలం కేటాయించాలని వినతి



పిడుగురాళ్ల: ఆయుర్వేద వైద్యశాల నిర్మాణానికి స్థలం కేటాయించాలని మున్సిపల్ కమిషనర్ ఎ. వెంకటేశ్వర్లను ఆయుర్వేద వైద్యశాల అధికారి మేఘమాల కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేఘమాల మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యశాలకు రోజు రోజు ప్రజలు రావడం ఎక్కువ అవుతున్నారని, దానిని దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ పరిధిలో స్థలం కేటాయిస్తే కొత్త భవనం నిర్మాణం చేపడతామని ఆమె తెలియజేశారు. కమిషనర్ ఎ. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిల్ దృష్టికి తీసుకుని వెళ్తామని తెలియజేశారు. శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

విత్తనాల షాపుల్లో అధికారుల తనిఖీ



మాచర్ల: పట్టణంలోని వివిధ విత్తనాల విక్రయాల షాపులను నియోజక వర్గ సహాయ వ్యవసాయ సంచాలకులు జగదీష్‌రెడ్డి, ఏఓ లక్ష్మారెడ్డి మంగళవారం పలు షాపులను తనిఖీలు చేసి పరిశీలన జరిపారు. ఆయా షాపుల్లో తనిఖీలు నిర్వహించడంతో విత్తనాలు విక్రయించే షాపుల యజమానులతో మాట్లాడుతూ పత్తి, మిరప విత్తనాలు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకోబడతాయన్నారు. విత్తనాల డీలర్లు విధిగా విత్తన ధరల పట్టిక ప్రదర్శించాలన్నారు. ప్రభుత్వం వారు నిర్ణయించిన ధరకే అమ్మాలన్నారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుని షాపులు సీజ్ చేస్తామన్నారు. విత్తనాల దుకాణదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రతాప్, అనిల్ తదితరులున్నారు.

ఇళ్ల నిర్మాణాల పురోగతి పెంచాలి

శావల్యాపురం: ప్రధానమంత్రి ఆవాస్ పథకంలో నూతన ఇళ్ల నిర్మాణాల పురోగతి పెంచాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. మంగళవారం శావల్యాపురంలో నూతన ఇళ్ల నిర్మాణ పురోగతి పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీలో 272 నూతన ఇళ్ల నిర్మాణాల కోసం అనుమతులు రాగా 64 మంది లబ్ధిదారుల ఇళ్లు నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఒక్కో గృహానికి రూ.ఒక లక్ష 80 వేలు లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో నిర్మాణాలు ఆధారంగా దఫాల వారీగా నగదు ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. బిల్లులు పెండింగ్‌లో లేవన్నారు. ఆయనతో పాటు ఉపాధి పథకం టీఏ సుధాకర్ ఉన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నరసరావుపేట టౌన్: డివైడర్‌పై నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు టూటౌన్ ఎస్ఐ షేక్ రహంతుల్లా మంగళవారం తెలిపారు. మయూరి లాడ్జి సెంటర్‌లో రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ పై నుంచి తెల్లవారుజామున సుమారు 50 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి పడి మృతి చెందాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించామన్నారు. మృతుడు యాచకుడిగా భావిస్తున్నామన్నారు. మృతుడి వివరాలు తెలిసినవారు టూటౌన్ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

200 మందికి వైద్య పరీక్షలు

అచ్చంపేట: మండలంలోని పెదపాలెంలో మంగళవారం జరిగిన ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమంలో 200 మందికి పైగా వైద్యసేవలు అందించినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ శ్యామల తెలిపారు. జ్వరాలు, దగ్గుతో బాధపడేవారినికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశామన్నారు. 7గురు జ్వరంతో బాధపడేవారిని గుర్తించి వారికి ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఆరోగ్యంపై తగు సూచనలు చేసినట్లు చెప్పారు. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమ లు దరిచేరకుండా దోమతెరలు, విండో నెట్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

అర్హతే ప్రామాణికంగా పేదలకు పథకాలు

ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి

పిడుగురాళ్ల: అర్హతే ప్రామాణికంగా, కులమతాలకు, పార్టీలకు అతీతంగా ఎవరి సిఫార్సు లేకుండా ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వం ఏదైనా ఉంది అంటే అది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 30వ వార్డులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని షాదిఖానా ఎదురు బజారు నుంచి ప్రారంభించారు. మహిళలు హారతులు పట్టి వార్డులోకి ఆహ్వానించారు. ప్రతి గడపకు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్థానిక సమస్యలను అక్కడ ఉన్న అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కార మార్గాన్ని కల్పించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి అందించిన లబ్ది వివరాలను తెలుపుతూ లబ్ధిపత్రాలను అందిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ 30వ వార్డులో గడప గడప కార్యక్రమం నిర్వహించే సమయంలో కొంత మంది ఈ ప్రాంతం ఎక్కువగా టీడీపీ ఓటర్లు ఉన్నారని తెలిపారు, అయితే తాను అధికారంలో ఉంది అందరి కోసమని, ఇక్కడ ఇప్పుడు రాజకీయం చేయడానికి రాలేదని ప్రతి గడపకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరిస్తున్నామని, అదేవిధంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి ఇప్పటికే



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల లబ్ధిపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

చేశామని, ఇంకా చేయాల్సి ఏమైనా ఉందని తెలుసుకుంటున్నామన్నారు. పార్టీలకు, కలమతాలకు అతీతంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం ఏర్పాటు చేశారని, ఈ కార్యక్రమం గత తొమ్మిది నెలల నుంచి చేపడుతున్నామన్నారు. తమకు ప్రజల అభివృద్ధే మా లక్ష్యమన్నారు. వారి సమస్యలు పరిష్కరించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పరచటమే మా విధేయతగా ముందుకు సాగుతున్నామన్నారు. ఇప్పటికే పిడుగురాళ్ల పట్టణంలో గత 70 సంవత్సరాల నుంచి ఏ ప్రభుత్వం కృష్ణా జలాలు అందించిన దాఖలాలు లేవన్నారు. ఒక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే పిడుగురాళ్ల పట్టణంలోని అనిన వార్డులకు కృష్ణా జలాలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 6 వేల గృహాలకు కృష్ణా జలాలు వాటర్ కనెక్షన్‌లు ఇవ్వడం జరిగిందని, మిగిలిన ప్రతి గృహానికి ఏడాదిలోగా అందిస్తామని తెలిపారు. ఇప్పటికే పిడుగురాళ్ల పట్టణంలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు రోడ్డు విస్తరణ పనులు, అలాగే త్వరలోనే బైపాస్ పూర్తి చేయబోతున్నామన్నారు. ఇప్పటికే సుమారు 7 వేల మందికి ఇళ్ల పట్టాలు అందించటం జరిగిందన్నారు. జానపాడు రోడ్డులో రైల్వే బ్రిడ్జి మంజూరు అయిందని, త్వరలోనే దాని శంకుస్థాపన కూడా చేస్తామని తెలిపారు. ఇవి కాక నవరత్నాల పథకాల ద్వారా అమ్మ ఒడి, పెన్షన్‌లు, చేయూత, ఆసరా, విద్యా దీవెన, వసతి దీవెన, ఆరోగ్య శ్రీ వంటి పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధితోపాటు గురజాల నియోజకవర్గ అభివృద్ధి కూడా ప్రజలు ఊహించని విధంగా చేపడుతున్నామని ఈసందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు.

చంద్రబాబు మ్యానిఫెస్టోలో వినూత్నం ఏమి లేదు..

చంద్రబాబు నాయుడు ఇటీవలే తన టీడీపీ పార్టీ తరుపున మ్యానిఫెస్టోను విడదుల చేశారు, ఇందులో వినూత్నమైన అంశాలు ఏమీ లేవు, అన్ని కాఫీ రైట్స్‌నని పలువురు వక్తలు విశ్లేషిస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చే పథకాలనే కాపీ చేసి ఇస్తున్నారు. ఇప్పుడు చంద్రబాబు మాకు ఎందుకు జగన్‌మోహన్‌రెడ్డే ప్రభుత్వమే బాగుందని తెలుపుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబునాయుడు చెప్పే తప్పుడు మ్యానిఫెస్టోలను స్వీకరించే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ. వెంకటేశ్వర్లు, 30వ వార్డు కౌన్సిలర్ ఉన్నం భారతి ఆంజనేయులు, మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ గఫార్, వార్డు కన్వీనర్ సయ్యద్ జబీర్, కౌన్సిలర్లు అన్నెం పద్మావతి, అజ్మీర శారద, జూలకంటి శ్రీనివాసరావు, మాదాల కిరణ్, సైదావలి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎండీ లతీఫ్, అక్బర్, సైదా, మద్దాలి సుబ్బయ్య, షేక్‌మస్తాన్‌వలి,సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు , వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రెండవ రోజు ఘనంగా ప్రతిష్ట మహోత్సవం

మాచర్ల: పట్టణంలో బస్టాండ్ సెంటర్‌లో వేంచేసి యున్న శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆయా స్వామి వార్ల నూతన శిలా విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం రెండవ రోజు మంగళవారం వైభవంగా జరిగింది. అర్చకులు పరుశురాం రామాంజనేయ చార్యులు, రాజకృష్ణమాచార్యులు, ఈఓ గిరిరాజు నర్సింహబాబు ఆధ్వర్యంలో ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మూడు జిల్లాల వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి దంపతులచే పంచామృతాలతో విగ్రహాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో 12 మంది అర్చకులచే విష్వక్సేన పూజ, పుణ్యాహము, అగ్ని ప్రతిష్ట చతుర్ధశ కలశ స్థపన, బింబశుద్ధి, పంచగవ్య ప్రాశన, పంచగవ్యాధివాసము, యుక్తహోమము, క్షీరాధివాసము, కుంభకళావాహన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అభివృద్ధి కమిటీకి చెందిన వీరాంజనేయ రెడ్డి, చుండూరు మల్లిఖార్జునరావు, గట్ల కోటిరెడ్డి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి ఏడు జిల్లాల వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి దంపతులు, సామూహిక నరసింహ్మ



శిలా విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పీవీఆర్ దంపతులు

వ్రతం నిర్వహించారు. రెండవ రోజు మహోత్సవానికి ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు పూజా కార్యక్రమాలు...

పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా నవగ్రహ హోమం, శిలా విగ్రహాలకు గ్రామోత్సవ ప్రభూతబలి, మహాశాంతి హోమం, పంచశిల్పాదివాసము కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

సెల్ ఫోన్ షాపు యజమానిపై దాడి

నూజెండ్ల: వినుకొండలోని బస్టాండ్ సెంటర్ మొబైల్‌షాపు యజమానిపై కొంత మంది యువకులు మద్యం మత్తులో దాడిచేశాడు. దాడిలో షాపు యజమాని గోపిరెడ్డి వీరారెడ్డితో పాటు, షాపులో పనిచేస్తున్న మరో యువకుడికి గాయాలు అయ్యాయి. తొలుత సెల్‌ఫోన్‌షాపులు ఇరువురు యువకులు సిగరేట్ తాగుతూ లోపలకు వచ్చారు. దీంతో వారిని వీరారెడ్డి బయటకు వెళ్లి సిగరెట్ తాగాలన్నాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న నిందితులు బలంగా రాయితో వీరారెడ్డికాలుపై మోదారు. పది నిమిషాల వ్యవధిలో మరో 15 మంది యువకులు కలిసి విచక్షణారహితంగా దాడిచేసి షాపులో కంప్యూటర్‌తోపాటు పరికరాలు ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం

-మూడు చెక్కులను అందజేసిన జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: స్థానిక రూరల్ పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తాళ్లూరి సూర్యనారాయణ కుటుంబానికి పోలీసుశాఖ రూ.1.75 లక్షల ఆర్థిక సహాయం అందజేసింది. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి హెడ్‌కానిస్టేబుల్ భార్య లతకు మూడు చెక్కును అందజేశారు. ఈఏడాది ఏప్రిల్ 12వ తేదీన సూర్యనారాయణ మృతిచెందగా అతని కుటుంబానికి పోలీసుశాఖ తరపున అదనపు కార్పస్ ఫండ్ రూ.1లక్ష, విడోఫండ్ రూ. 50వేలు, ఇన్సిడెంటల్ చార్జెస్ మరో రూ.25 వేలు విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో



హెడ్‌కానిస్టేబుల్ భార్య లతకు చెక్కులు అందజేస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, అధికారులు

ఏ ఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు, క్రైం అదనపు ఎస్పీ ఓ.చంద్రశేఖర్, జిల్లా ఏఏవో కేవీడీ రామారావు, ఆర్ఐ వెంకట రమణ, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు టి.మాణిక్యాలరావు పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు చిత్రకారుడు ఊతం

వినుకొండ టౌన్: పేదరికం ప్రతిభకు అడ్డు కాదని, అటువంటి వారికి బాసటగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని పట్టణానికి చెందిన చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ గ్రూప్‌లో విద్యనభ్యసిస్తున్న పట్టణంలోని సీతయ్య నగర్‌కు చెందిన కోండ్రు శేఖర్, దీనమ్మల మూడవ కుమార్తె జ్యోతి ప్రతిభ కనబరిచి, ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో 962 మార్కులతో పల్నాడు జిల్లా స్థాయిలో టాపర్‌గా నిలిచింది. కాగా నీట్ కోచింగ్‌కై అవసరమైన ఆర్థిక సహాయం కోసం ఎదురు చూస్తున్న విషయాన్ని తెలుసుకున్న పట్టణానికి చెందిన చిత్రకారుడు జెస్టిస్ బ్యూలా దంపతులు తమ వంతు 20 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని మంగళవారం ఆమెకు అందచేశారు. అదేవిధంగా విషయం తెలుసుకున్న గుడివాడకు చెందిన పాస్టర్ పిళ్లా వెంకటరత్నం 60 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని చిత్రకారుడు జెస్టిస్ ద్వారా అందించారు. పేద కుటుంబానికి చెందిన జ్యోతి లక్ష్యమైన డాక్టర్ కోర్సు పూర్తి చేసేందుకు దాతలు ముందుకు రావాలని జెస్టిస్ విజ్ఞప్తి చేశారు. వివరాలకు 9848469694 నెంబరుకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్ ఆల్ఫ్రెడ్, పాస్టర్ నతానియేల్, వసంత కుమారి, యెషయా, నాగమణి, ఒంగోలు జ్యోతి, టీచర్ సుజని, జెస్సి, జేసన్, రైనీ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

చిలకలూరిపేట: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని... ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్య లభిస్తుందని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు కోరారు. పాఠశాలల ఆవాస ప్రాంతాల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్చాలని అవగాహన కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్కారు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నదని వివరించారు. ఇంగ్లీషు మీడియం విద్యతో పాటు అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద ఎన్నో పథకాలు అమలు చేస్తున్నదని చెప్పారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఐరన్ మాత్రల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మనబడి నాడు-నేడు ద్వారా పాఠశాలలకు అన్ని వసతులు సమకూర్చారని వివరించారు.



ప్రచారం నిర్వహిస్తున్న ఎంసీఆర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు

వేసవి సెలవుల్లో సైతం వియ్ లవ్ రీడింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన విద్యాసంవత్సరంలో ఆయా పాఠశాలల ఆవాస ప్రాంతాల్లోని కొత్త విద్యార్థులను చేర్పించే బాధ్యత తల్లిదండ్రుల కమిటీలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10లోగా వైఎస్సార్ బీమా ఈకేవైసీ చేయించండి

నరసరావుపేట: వైఎస్సార్ బీమా పథకంలో ఈకేవైసీని వలంటీరు ద్వారా ఈనెల పదో తేదీ లోగా పూర్తిచేసుకోవాలని డీఆర్‌డీఏ, వైఎస్సార్ కేపీ పథక సంచాలకులు బి.బాలూనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైస్ కార్డులో పేర్కొన్న విధంగా కుటుంబంలో సంపాదించే వ్యక్తి 2023-24 ఏడాదికి రెన్యూవల్, నూతన వ్యక్తులు వలంటీరు ద్వారా పూర్తి చేసుకోవాలని సూచించారు. రెన్యువల్‌లో ఎవరినీ మిస్ చేయకుండా వందశాతం పూర్తిచేయాలని వలంటీర్లను కోరారు.

ఐదు కుటుంబాలకు నగదు వితరణ

యడ్లపాడు: మండకేంద్రమైన యడ్లపాడు గ్రామంలో పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఐదుగురికి జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. ఇటీవల ప్రమాదంలో చనిపోయిన డ్రైవర్ శ్రీను, ఎస్సీకాలనీకి చెందిన కట్టా పేరయ్య రెండు కుటుంబాలు, రోడ్డు ప్రమాదంలో గాయపడిన కామిని గోపీ, ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న కొత్తూరు వాసి కోటి లింగాచారి, వంకాయలపాడు గ్రామానికి చెందిన రహంతుల్లా కుటుంబాలను ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా సందర్శించి పరామర్శించారు. అనంతరం ఆయా కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున మొత్తం రూ.50 వేలను అందించారు. కార్యక్రమంలో చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, జాలాది సుబ్బారావు, బి వి రెడ్డి,గొంటు శ్రీనివాసరెడ్డి, మానుకొండ శేషిరెడ్డి, కరీమ్, ఇమ్రాన్ పాల్గొన్నారు

పోలీస్ స్టేషన్లో డీఎస్పీ తనిఖీ

రొంపిచర్ల: స్థానిక పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ కేవీ మహేష్ మంగళవారం సందర్శించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా స్టేషన్‌కు వచ్చినట్లు ఆయన తెలిపారు. రికార్డులను పరిశీలించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టిసారించాలన్నారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్ కుమార్ పాల్గొన్నారు.



మెరుగైన సేవలు అందించాలి

శావల్యాపురం: మండలంలోని కొత్తలూరు గ్రామసచివాలయాన్ని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ సచివాలయ ఉద్యోగులు



అంకిత భావంతో విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. అనంతరం రికార్డులు సమయపాలన ప్రజల అభిప్రాయసేకరణ స్వీకరించారు. వైఎస్సార్ బీమా యోజన పథకం పురోగతి పరిశీలించారు. ఫ్యామిలీ వైద్యాధికారి కార్యక్రమం నిర్వహణ వైద్యులు పనితీరు రోగుల వివరాలు అందుతున్న వైద్యసేవలు పరిశీలించారు. ఆయనతో పాటు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా సాంబశివరావు



నూతన అధ్యక్షునిగా ఎన్నికైన కొత్త సాంబశివరావుతో ఆర్యవైశ్య సంఘం నాయకులు



కొత్త సాంబశివరావు

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా సాంబశివరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ఆర్యవైశ్య ఏసీ కల్యాణ మండపంలో ఆర్యవైశ్య ప్రముఖులు కొత్త సాంబశివరావు(వనజ)ను ఎన్నుకున్నారు. సాంబశివరావు ఎన్నిక అవ్వడంతో ఆర్యవైశ్య ప్రముఖులు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా కొత్త సాంబశివరావు మాట్లాడుతూ ఆర్యవైశ్య దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలియజేశారు. పిడుగురాళ్ల ఆర్యవైశ్య ప్రముఖులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉన్నారు.

అక్రమ మద్యం కలిగి ఉన్న వ్యక్తి అరెస్ట్

వినుకొండ (నూజెండ్ల): అక్రమ మద్యం కలిగి ఉన్న వ్యక్తిని ఎస్ఈబీ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. నూజెండ్ల మండలం రాముడుపాలెం గ్రామంలో అల్లం వెంకటేశ్వర్లు అనే వ్యక్తి 29 మద్యం సీసాలు కలిగి ఉండగా అతనిని అరెస్ట్ చేసి వినుకొండ కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ లక్ష్మి పాల్గొన్నారు.

విత్తనాలు అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవు

ఏడీఏ శ్రీ కృష్ణదేవరాయలు

పిడుగురాళ్ల: రైతులకు విత్తనాల దుకాణ దారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే ఎక్కువ అమ్మితే కఠిన చర్యలు తప్పవని పిడుగురాళ్ల ఏడీఏ శ్రీ కృష్ణదేవరాయలు హెచ్చరించారు. పట్టణంలోని పలు విత్తన దుకాణాలను మంగళవారం అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ శ్రీ కృష్ణదేవరాయులు మాట్లాడుతూ పలువురు రైతులు మిర్చి విత్తనాలపై విత్తన దుకాణదారులు అధిక ధరలు వసూళ్లు చేస్తున్నారని తన దృష్టికి రావడంతో విత్తన షాపులను తనిఖీ చేయడం జరిగిందని తెలిపారు. అయితే షాపుల్లో రైతులకు రాసి ఇచ్చిన బిల్లులో అధిక ధరలు ఎక్కడా కనిపించలేదన్నారు. రికార్డులు అన్ని సక్రమంగా ఉన్నాయని తెలిపారు. అయితే రైతులతో మరోసారి చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని ఈ సందర్భంగా



విత్తనాల దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్రీ కృష్ణదేవరాయులు, ఏఓలు

ఏడీఏ తెలిపారు. ఏది ఏమైనప్పటికి విత్తన దుకాణ దారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కన్నా ఎక్కువగా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మాచవరం ఏఓ రావమ్మ, దాచేపల్లి ఏఓ పాపకుమారి, నకరికల్లు ఏఓ దేవదాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గణపవరంలో రామాలయ ప్రతిష్ట

నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో సుమారు రూ.2.5 కోట్ల వ్యయంతో పూర్తి రాతితో నిర్మించిన రామాలయ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం జరగనుంది. ప్రతిష్టకు చిన్న జీయర్ స్వామి హాజరుకానున్నారు. ఉదయం 7.43 గంటలకు శాస్త్రోక్తంగా మూలమూర్తుల ప్రతిష్ట, కలశ, జీవధ్వజ స్తంభ ఏర్పాటు జరనుంది. ఈ నెల 3 నుంచి కెల్లంపల్లి వీరయ్య ధర్మ సత్రం ఆవరణలో ఏర్పాటు చేసిన యాగశాలలో టీటీడీ వేదపాఠశాల అధ్యాపకులు శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో హోమాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం మూలమూర్తులకు అభిషేకాలు నిర్వహించి జలాధివాసం అనంతరం విగ్రహాలను ఆలయం వద్దకు చేర్చారు. విగ్రహాలతో పాటూ జీవ ధ్వజస్తంభానికి పూజలు నిర్వహించారు. మంగళవారం రాత్రి బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో సువాసనీ సుమంగళి పూజలు, అర్చనలు నిర్వహించారు. 250 మంది మహిళలకు చీరలు బహూకరించారు. త్రిదండి చినజీయర్ స్వామి శిష్యులైన గుదిమెళ్ళ శ్రీ కూర్మనాథ స్వామి, ధారిమ్మక ఉపన్యాసకులు శ్రీనివాస దీక్షితులు, ధనలక్ష్మి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పేర్ని వీరనారాయణ, వ్యాఖ్యాన సరస్వతి ఎ.వి.కె. సుజాత



ప్రతిష్ఠకు సిద్ధమైన రామాలయం

రామయణ ప్రవచనం నిర్వహించారు. ఉదయం చినజీయర్ స్వామి చేతుల మీదుగా బింబ ప్రతిష్ట, 10.30 గంటలకు ధ్రువకళ్యాణం (ప్రతిష్ఠా కళ్యాణం) నిర్వహించనున్నారు. అనంతరం చిన జీయర్ స్వామి వారి ప్రసంగం జరగనుంది. 11 గంటల నుంచి సుమారు 50 వేల మందికి అన్నదాన కార్యక్రమం ప్రారంభం కానుంది.

ఆకర్షణగా రామసేతు రాయి....

రామసేతు వారధి నిర్మాణానికి వినియోగించిన రాయి భాగాన్ని రామేశ్వరం నుండి ప్రత్యేకంగా తీసుకు వచ్చారు. దీన్ని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. రాయి విశిష్టత గురించి శ్రీనివాస దీక్షితులు చేసిన ప్రసంగం భక్తులను ఆకట్టుకుంది.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

నాదెండ్ల: నకిలీ విత్తనాలను విక్రయించే వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ చెప్పారు. సాతులూరు గ్రామంలో రెండు విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రోమోర్, లక్ష్మీసీడ్స్‌లో తనిఖీలు చేసి యజమానులకు సూచనలు చేశారు. వ్యాపారులు విక్రయించే విత్తనాల తాలూకు బిల్లులను రైతులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. అధీకృత డీలర్ల వద్దనే రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలన్నారు. వ్యాపారులు అధిక ధరలకు విక్రయాలు చేసినా, బ్లాక్ మార్కెట్‌కు పాల్పడినా తమకు సమాచారం ఇవ్వాలని రైతులను కోరారు. రైతులు ఖరీఫ్ సీజన్‌లో విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట వ్యవసాయాధికారి ఎ.హరిప్రసాద్, వీవోఏలు ఉన్నారు.



సాతులూరులో దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ మస్తానమ్మ, ఏవో హరిప్రసాద్

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రొంపిచర్ల : మండలంలో విప్పర్లపల్లి గ్రామంలో గల ఏరువాక విఘ్నేశ్వర ఆలయ 12వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అందంగా అలంకరించి విశేష, సహస్రనామ, కుంకుమార్చన, అలంకరణ పూజలు జరిగాయి. ఆలయపూజారి చతుర్వేదుల భరత్ కుమార్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. రాత్రి వేళల్లో ఆలయ ఆవరణలో భజన కార్యక్రమం జరిగింది.